క్లుప్తంగా

రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పనులు



ఎస్.యానాంలో ఉపాధి కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీవో రాజామణి

ఉప్పలగుప్తం: గ్రామాల్లో నిర్వహించే ఉపాధి పనులను రైతులకు ఉపయోగపడేలా చేపట్టాలని ఏపీవో వి.రాజామణి అన్నారు. మండలంలోని ఎస్.యానాంలో ఉపాధి కూలీల మస్టర్లను బుధవారం ఆమె పరిశీలించారు. గ్రామంలో రెండు వేర్వేరు పనుల్లో 389 మంది పనిచేస్తున్నారన్నారు. ఆమె మాట్లాడుతూ వేతనదారులందరూ సమయానికి పనికి హాజరవ్వాలని, కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. ఎండల ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్ చీకట్ల సుబ్బారావు ఉన్నారు.

స్పందన ఫిర్యాదులకు ప్రాధాన్యం

అల్లవరం: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ, ఆయా శాఖల అధికారులు పరిష్కారం చూపాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్వేయర్లు, వ్యవసాయ, పశుసంవర్ధక సహాయకులతో సమీక్షించారు. భూమి సరిహద్దులకు సంబంధించి ఫిర్యాదులు స్పందనకు ఎక్కువగా అందుతున్నాయని, వాటిపై సర్వేయర్లు దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో గ్రామాల్లో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించడానికి పశుసంవర్ధక సహాయకులు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వాహనోత్సవం



హంస వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

అమలాపురం రూరల్: బండారులంకలోని బిళ్లవారివీధిలో కొలువైన పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారి వాహనోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ముందుగా అంకం నాగసత్యనారాయణ, పద్మావతి దంపతులతో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వాహన సేవలో అరటి మామిడి తోట, నారాయణరావు పేట యువత పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమభారతి, దంగేటి రుద్ర, గుత్తుల మురుగుల రాజు, దంగేటి వెంకటశెట్టి, శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వద్దు

అల్లవరం: సమాచార హక్కు చట్టం ద్వారా ఎవరైనా సమాచారాన్ని కోరితే 30 రోజుల వ్యవధిలో ఫిర్యాదుదారుడు కోరిన సమాచారాన్ని ఇవ్వాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. తూర్పులంక గ్రామానికి చెందిన ఐవీవీ సత్యనారాయణ సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని కోరితే ఐదు నెలలు కావస్తున్నా సమాచారం ఇవ్వకపోవడంతో అప్పీల్ అథారిటీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీఓ విచారణ చేపట్టారు. జూన్ 11 లోగా ఫిర్యాదుదారుడు అడిగిన సమాచారం ఇవ్వాలని తూర్పులంక కార్యదర్శి కేవీవీ సత్యనారాయణను ఆదేశించారు. ఫిర్యాదుదారుడికి సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన కార్యదర్శిని మందలించారు. మరోసారి పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

ఘనంగా మరిడమ్మ జాతర



జాతరలో కళాకారుల గరగ నృత్యాలు

ముమ్మిడివరం: ఠానేల్లంక శివారు మొల్లి గ్రామ దేవత మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా మూడు రోజుల పాటు జాతర మహోత్సవాలు నిర్వహిస్తారు. ఆదివారం నుంచి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి గరగ నృత్యాలు, సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పులు, తీన్మార్ డప్పుల వాయిద్యాలతో ఊరేగించారు. అధిక సంఖ్యలో గ్రామ ఆడపడుచులు పూజలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. గురువారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జీవ వైవిధ్య దినోత్సవాలకు శ్రీకారం



అమలాపురంలో జీవ వైవిధ్య వారోత్సవాల ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న జేవీవీ ప్రతినిధులు



యానాంలో జీవ వైవిధ్యాన్ని తెలిపే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాలు స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. జేవీవీ అమలాపురం శాఖ గౌరవాధ్యక్షుడు డి.శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీవ వైవిధ్య దినోత్సవాలను ప్రారంభిస్తూ పర్యావరణ పరిరక్షణకు మానవ ప్రయత్నంగా మనమేం చేయాలనే సందేశాన్ని వక్తలు వివరించారు. జీవ రాశులను ఎలా కాపాడుకోవాలో తెలిపారు. డార్విన్ సిద్ధాంతం ప్రకారం అన్ని జీవులు మనగలగాలని సూచించారు. జేవీవీ రాష్ట్ర పర్యావరణ సబ్ కమిటీ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి మే 22వ తేదీని అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని జరుపుకోవాలన్న పిలుపునకు జేవీవీ రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోందన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా మాట్లాడుతూ ఈ వారోత్సవాలు అమలాపురం నుంచి శ్రీకారం చుట్టామని, జిల్లా వ్యాప్తంగా అన్ని జేవీవీ శాఖలు వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఏపీ ఆర్‌పీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జేవీవీ ప్రతినిధులు వీవీఆర్‌కే అర్జునరావు, త్రినాథ్‌కుమార్, ఎన్.అబ్బులు, బీఎస్ వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. జీవ వైవిధ్య వారోత్సవాల ఆహ్వాన పత్రాలను జేవీవీ ప్రతినిధులు విడుదల చేశారు.

యానాం: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డి.త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రకృతి, జీవ వైవిధ్యం తదితర అంశాలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ జీవుల సమతుల్యత దెబ్బతినకుండా పరిరక్షించుకోవాలన్నారు. గౌరవాధ్యక్షుడు, కవి దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ పలు జీవ జాతుల ఉపయోగాలను తెలిపారు. అనంతరం జీవ వైవిధ్యం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కె.అప్పారావు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పరిరక్షణే ధ్యేయం



బయోడైవర్సిటీ డేలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

యానాం: జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జె.శివ సుబ్రహ్మణ్యన్ అన్నారు. బి పార్ట్ ఆఫ్ ది ప్లాన్ అనే నినాదంతో అంతర్జాతీయ బయోలాజికల్ బయోడైవర్సిటీ డే పురస్కరించుకుని బుధవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ వైల్డ్‌లైఫ్ ఓ కార్యక్రమం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివ సుబ్రహ్మణ్యన్ పర్యావరణ పరిరక్షణకు జీవ జాతులు చేసే మేలును వివరించారు. రిసోర్స్‌పర్సన్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన జీవ వైవిధ్యాన్ని భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాలని కోరారు. అనంతరం ఐటీఐ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జోగి రాజు, ఫీల్డ్ సిబ్బంది ఖాన్, ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ పాల్గొన్నారు.

అధికారులతో ఆర్‌ఏఓ సమీక్ష

యానాం: రానున్న నైరుతి రుతుపవనాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఆర్‌ఏఓ మునిస్వామి అధ్యక్షతన ఆయన చాంబర్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికే అండమాన్ దాటి కేరళలో ప్రవేశించిన రుతు పవనాలతో కొద్ది రోజుల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో పీడబ్ల్యూడీ, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ రాజశేఖరన్, వ్యవసాయాధికారి జోగిరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరుని రథోత్సవం



తాళ్లరేవు పురవీధుల్లో నిర్వహిస్తున్న వేంకటేశ్వరుని రథోత్సవం

తాళ్లరేవు: వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామివారి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం దేవేరులను రథంపై ఉంచి తాళ్లరేవు పురవీధుల్లో ఊరేగించారు. వేట్లపాలెం నాగేశ్వరరావు మాష్టారు కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో రథోత్సవం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎన్నికల ఫలితాలపై శాంతియుతంగా ఉండాలి



వాసాలతిప్పలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు



నల్లమిల్లి రాజీవ్ గృహకల్ప వద్ద పోలీసుల తనిఖీలు

ఉప్పలగుప్తం: వచ్చే ఎన్నికల ఫలితాలపై ప్రజలంతా శాంతియుతంగా మెలగాలని ఎస్సై కె.మనోహర జోషి అన్నారు. ఎన్నికల ఫలితాలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి వాసాలతిప్పలో బుధవారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనుమానాస్పందంగా ఉన్న వ్యకులు, గొడవలు పాల్పడుతున్న వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, రికార్డుల్లేని 14 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరైనా వాహనాలతో ఊరేగింపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాణసంచా, ర్యాలీలు నిషేధం

అల్లవరం: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరూ గెలిచినా బాణసంచా కాల్చడం, ర్యాలీలు చేయడం నిషేధమని ఎస్సై హరీష్‌కుమార్ అన్నారు. ఎస్.పల్లిపాలెంలో వివిధ పార్టీల నేతలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఎవరూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని ఎస్సై తెలిపారు.

తీర గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్

ఐ.పోలవరం: ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఐ.పోలవరం ఎస్సై జె.భానుప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం మండల తీరగ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని 50 మోటార్ బైక్‌లు, ఒక పాసింజర్ ఆటో, మరో మినీ ట్రాన్స్‌పోర్టు ఆటోను సీజ్ చేశారు. భైరవపాలెంలో అక్రమంగా డీజిల్ అమ్ముతున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి నుంచి 450 లీటర్ల డీజిల్‌ను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున సమావేశాలు, సభలు, నలుగురు అంతకంటే ఎక్కువ మంది గుడిగూడటం చేయకూడదన్నారు. కౌంటింగ్ రోజున అభ్యర్థులు, ఏజెంట్లు మాత్రమే కేంద్రాలకు వెళ్లాలన్నారు.

రాజీవ్ గృహకల్ప వద్ద..

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏ విధమైన హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అమలాపురం తాలూకా పోలీసులు బుధవారం నల్లమిల్లి గ్రామంలో రాజీవ్ గృహకల్ప వద్ద తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాలూకా ఎస్సై శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏ విధమైన రికార్డులు లేని పది మోటార్ సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు.

పెండ్యాల మృతికి ఎమ్మెల్సీ సంతాపం



మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు పెండ్యాల కృష్ణబాబు మృతికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు సంతాపం తెలిపారు. స్థానిక హైస్కూలు సెంటరులోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన సంతాప సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు నీతి నిజాయితీ, రాజకీయ విలువలతో పనిచేశారని కొనియాడారు. సినీ నిర్మాతగా, ఆంధ్ర షుగర్స్ అధినేతగా విధులు నిర్వహిస్తూనే, కొవ్వూరు నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారని గుర్తు చేశారు. వితరణ శీలిగా, ఎందరో కళాకారులను ప్రోత్సహించిన కృష్ణబాబు మృతికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించింది. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్, యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు యువత ప్రాధాన్యమివ్వాలి

సీచమ్ టోర్నీ ప్రారంభించిన ఎస్పీ రాజశేఖరన్



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న అధికారులు

యానాం: యువత విద్యతో పాటు, క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని, తద్వారా జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని ఎస్పీ యు.రాజశేఖరన్ అన్నారు. బుధవారం యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోషియేషన్(వైడీసీఏ) ఆధ్వర్యంలో స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే సీచమ్ క్రికెట్ ట్రోఫీ–2024 టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రాంతీయ స్థాయి టోర్నమెంట్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. అంతకుముందు ఎస్పీ రాజశేఖరన్ తదితరులు క్రీడాకారులను కరచాలనం ఇచ్చి, టోర్నీలో రాణించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 22 నుంచి 31 వరకు జరిగే టోర్నీలో మొత్తం 20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు పాల్గొంటుండగా, ఒక్కో జట్టు మొత్తం 4 మ్యాచ్‌లు ఆడనున్నాయి. జూన్ 1 సెమీఫైనల్స్, 2న ఫైనల్స్ జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పి రమేష్, సెక్రటరీ కె సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ చిట్టి, కె ప్రసాద్, పి ప్రసాద్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ పంతగడ సుమన్‌బాబు, సత్యం, కె జయచంద్ర, కె సత్యనారాయణ, పీఈటీలు పాలికి ప్రకాష్, చింతా వెంకన్న పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలతో ఆక్వా రైతుల కష్టాలు

లూజ్ పెట్రోల్, డీజిల్ నిషేధంపై కలెక్టర్‌కు ఆక్వా రైతుల వినతి



డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న ఆక్వా రైతులు

అమలాపురం రూరల్/కాట్రేనికోన: ఎన్నికల నేపథ్యంలో బంకులలో పెట్రోలు, డీజిల్ లూజ్ విక్రయాలను నిషేధించారని, దీనివల్ల ఆక్వా చెరువుల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆక్వా సంఘం నాయకుడు త్సవటపల్లి నాగభూషణం అన్నారు. ఈ విషయమై ఆయన ఆధ్వర్యంలో రైతులు బుధవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ నుపూర్, డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఆక్వా చెరువులలో రొయ్యలు, చేపలకు ఆక్సిజన్ అందించేందుకు ప్రతిరోజూ ఆయిల్ జనరేటర్‌ను వినియోగించాలన్నారు. డీజిల్ లేకపోతే జనరేటర్లు తిరగవని, ఎన్నికల నేపథ్యంలో డీజిల్‌ను విడిగా బంకుల్లో అమ్మడం లేదన్నారు. తమ ఇబ్బందులను గమనించి, మినహాయింపు ఇవ్వాలని కోరారు. జేసీ స్పందిస్తూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటించాలన్నారు. అయితే మత్స్యశాఖ అధికారుల ద్వారా ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు పంపిస్తామని తెలిపారు.

వంతెన సమీపంలో ఆటో బోల్తా



అప్పనరామునిలంక వైపు వంతెన దిగువన బోల్తా పడిన ఆటో

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య గోదావరి పాయపై కొత్తగా నిర్మించిన వంతెనకు సమీపంలో ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఒకటి బుధవారం బోల్తా పడింది. వంతెనకు అప్పనరామునిలంక వైపు నుంచి టేకిశెట్టిపాలెం ఏటిగట్టుకు వస్తున్న ఈ ఆటో వంతెన అప్రోచ్ రోడ్డు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తూ బోల్తా కొట్టి రోడ్డు చేరి ఉన్న గోదావరి నీళ్లల్లోకి జారుకుంది. అటుగా వెళుతున్న వారు హుటాహుటిన ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు. దీంతో ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అలాగే ఆటోను కూడా రోడ్డుపైకి చేర్చారు. కాగా ఎత్తుగా ఉన్న అప్రోచ్ రోడ్డు ఎక్కే క్రమంలో ఆటోకు చోటు చేసుకున్న ప్రమాదంపై వివరాలు తెలియాల్సి ఉంది.

వంతెనకు రెయిలింగ్ నిర్మించాలి

అయినవిల్లి: కొండుకుదురులో బొబ్బర్లంక–పల్లంకుర్రు పంటకాలువపై ఏర్పాటు చేసిన వంతెన రెయిలింగ్ కూలి ప్రమాదకరంగా మారింది. దీంతో రైతులు, వాహన చోదకులు ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రమాదాలు కూడా ఇక్కడ జరిగాయి. ఈ వంతెన నిర్మించి సుమారు ఇరువై సంవత్సరాలు కావస్తుంది. ఈ వంతెన ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఖరీఫ్ పంటకు కార్యాచరణ సిద్ధం

ఆలమూరు: స్థానిక సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లోని రైతులు ఖరీఫ్ పంటకు సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి ఏసుబాబు కోరారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏడీఏ కె.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఏఓ బోసుబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల రబీ సాగు ఆశాజనకంగా ముగిసిందన్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు పూర్తయినందున రైతులందరూ ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పిన ఆర్బీకేల్లో అన్నదాతలకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేశామన్నారు. అలాగే ఖరీఫ్ పంటకు అవసరమయ్యే ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. మండల స్థాయి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఏడీఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా విత్తనాలకు విత్తన శుద్ధి చేయాలన్నారు.

పేద కార్మికుని వైద్యానికి ఆర్థిక సాయం

'సాక్షి' కథనానికి స్పందన



పేద కార్మికుడు విజయ్‌కుమార్ భార్యకు నగదు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: 'పేద కార్మికునికి పెద్ద కష్టం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు మానవతా దృక్పథంతో స్పందించారు. బుధవారం తాళ్లరేవు, గొల్లపాలెం లయన్స్ క్లబ్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కాలేయ, క్లోమ వ్యాధితో బాధపడుతున్న స్థానిక రచ్చవారిపేటలోని బాధితుడు రచ్చ విజయ్‌కుమార్ ఇంటికి వెళ్లి అతని భార్య దీపిక, కుటుంబ సభ్యులకు నగదు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ వేలూరి సూరిబాబు, జోన్ చైర్మన్ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి, ఈ పేద కుటుంబానికి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కోశాధికారి నున్న దత్తు, తాళ్లరేవు క్లబ్, అధ్యక్ష, కార్యదర్శులు చోడే శ్రీనివాస్, రాయపురాజు, కోశాధికారి కట్టా ఆదినారాయణ, ప్రతినిధులు సామా భగవాన్, పొన్నాడ పేరయ్యరాజు, గొల్లపాలెం లయన్స్ క్లబ్ ప్రతినిధులు జి.సూర్యనారాయణరాజు, ఎస్.సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి

సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీసీ మధుసూదనరావు

ముమ్మిడివరం: మనబడి నాడు–నేడు పథకం రెండో దశ పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఏ.మధుసూదనరావు అన్నారు. స్థానిక ఎయిమ్స్ కళాశాల సమావేశపు హాలులో బుధవారం మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ ఆదేశాల మేరకు పథం రెండో విడత పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో, ఆయా పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభించే తేదీ నాటికి పనులన్నీ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారానికి ఒక పాఠశాలను నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలల్లో తాగునీరు, విద్యుదీకరణ, తరగతి గదులు, మైనర్–మేజర్ పనులు తదితర మౌలిక వసతులను పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సహకారంతో స్టేజ్ కంప్లీషన్ కూడా పూర్తి చేయాలన్నారు. మండల స్థాయిలో కాంపొనెంట్ వారీగా నాడు–నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించాలన్నారు. అదేవిధంగా పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీలు రావాల్సి ఉందని, అలాగే పనులు పూర్తి చేయడానికి సిమెంటు, ఇసుక కొరతగా ఉందని ఎంఈవోలు ఏపీసీ దృష్టికి తీసుకుని వచ్చారు. ఏపీసీ మధుసూదన్‌రావు మండలాల వారీగా సమీక్ష నిర్వహించి, పనుల ప్రగతిని తెలుసుకున్నారు. సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ప్రత్యామ్నాయ స్కూళ్ల కో–ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీఓ డాక్టర్ ఎంఎకే భీమారావు, ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ జి.ప్రవీణ్‌కుమార్, సమగ్రశిక్షా కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఈ సుబ్బరాజు పాల్గొన్నారు.

మెడికల్ వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న గాడిమొగ పీహెచ్‌సీ సిబ్బంది

తాళ్లరేవు: రహదారి చెంతన పడేసిన మెడికల్ వ్యర్థాల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, జాతీయ రహదారి 216 తాళ్లరేవు బైపాస్ రోడ్డు చెంతన కొందరు మెడికల్ వ్యర్థాలను పడేసి, వాటిని దగ్ధం చేస్తున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మెడికల్ వ్యర్థాలు, నీడిల్స్ ప్రమాదకరంగా మారుతున్నాయంటూ తాళ్లరేవు మాజీ ఎంపీటీసీ సభ్యుడు బొంతు మోహన్, మరికొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై తాళ్లరేవు పంచాయతీ, గాడిమొగ పీహెచ్‌సీ సిబ్బంది స్పందించి, వాటిని అక్కడి నుంచి తొలగించారు. ఇటువంటి ప్రమాదకర వ్యర్థాలను రహదారి చెంతన వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

త్రయంబకేశ్వర స్వామికి త్రిశూల సేవ



త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: పాత బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పంచ రాత్రి దివ్య కల్యాణం సందర్భంగా ఐదో రోజు బుధవారం త్రిశూలసేవ, నాగవల్లి సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లు, స్వామి వార్లు మేళతాళాలతో చింతా భీమలింగదాసు సోదరుల ఇంటి వద్ద పూజలు చేశారు. ఆలయ పురోహితుడు సద్గురువు సత్యనారాయణ అధ్వర్యంలో భక్తులతో త్రిశూలాన్ని నెత్తిన పెట్టి స్నానం చేయించారు. గురువారం మహాపుష్ప యాగం, పానకాల సేవతో పంచ రాత్రి కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయి.